రూ. 4 కోట్లతో సంగారెడ్డి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంగణంలో

నూతన భవన నిర్మాణం

- 3.80 కోట్లతో సదాశివపేట పట్టణం లో నూతన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణం
- ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని కలిసి ప్రతిపాదనలు అందించిన జగ్గారెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో నూతన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. సదాశివపేట పట్టణం లో ఆర్ అండ్ బి గెస్ట్ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకుంది. ఆ బిల్డింగ్ స్థానం లో రూ. 3.80 కోట్లతో నాలుగు సూట్ రూం లతో కూడిన నూతన గెస్ట్ హౌస్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సంగారెడ్డి పట్టణం జిల్లా కేంద్రం కావడం తో వివిఐపి, విఐపి ల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఇప్పుడున్న గెస్ట్ హౌజ్ సరిపోవడం లేదు. దీనికి అదనంగా అదే ప్రాంగణం లో నాలుగు సూట్ రూం లతో కూడిన మరో గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.4 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జగ్గారెడ్డి స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంటికి వెళ్లి ప్రతిపాదనలు అందించారు. జగ్గారెడ్డి ప్రతిపాదనలు ఆమోదించి వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయాలని ఆర్ అండ్ బి ఉన్నతాధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు.

దేశవ్యాప్తంగా మహిళల్లో

బీజేపీ విధానాలపై పెరుగుతున్న వ్యతిరేకత

విశ్వంభర, హైదరాబాద్ : ప్రజలకు వ్యతిరేకంగా బీజేపీ విధానాలున్నాయని దేశవ్యాప్తంగా సామాన్య మహిళల్లో అవగాహన పెరిగిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి మరియం ధావలే తెలిపారు. సోమవారం ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 26 రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా రాష్ట్రాల పరిస్థితులపై చర్చించి నివేదికలు సమర్పించారన్నారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసకు శిక్షలు లేవని, అక్కడ శాంతి స్థాపనకు బీజేపీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడే పరిస్థితులు లేవని, ఉద్యమకారులను బెదిరింపులు చేస్తున్నారని తెలిపారు. తమిళనాడులో మైక్రో ఫైనాన్స్ దోపిడీ, కుల హత్యలకు వ్యతిరేకంగా బిల్లులు తెచ్చినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర, ఒడిశాలో బీజేపీ హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. పుదుచ్చేరిలో రేషన్‌కు బదులుగా నగదు బదిలీతో ఆహార భద్రత దెబ్బతింటోందని, రేషన్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఐద్వా పి.కె. శ్రీమతి టీచర్ మాట్లాడుతూ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడులను నిరసిస్తూ, పాలస్తీనా, వెనిజువెలాకు సంఘీభావంగా తీర్మానాలు ఆమోదించామని తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష పేరుతో ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ మరో తీర్మానం చేశామన్నారు. మైనార్టీలపై దాడులను ఖండిస్తూ మరో తీర్మానం ఆమోదించామని చెప్పారు. ఒడిశాలో బీజేపీ అధికారంలోకి రాగానే ధారాసింగ్‌ను విడుదల చేయడం, హామీలు అమలు చేయకపోవడం ప్రజా వ్యతిరేకమని మరియం ధావలే అన్నారు. కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్, పెన్షన్ పెంపు అమలు కాలేదని పేర్కొన్నారు. ఐద్వా మహాసభల విజయానికి పలు ప్రజాసంఘాలు శుభాకాంక్షలు తెలిపాయి.

ఆకట్టుకుంటున్న ఆర్ట్ గ్యాలరీ

హైదరాబాదు ఆర్టీసీ కళాభవన్ లో కొనసాగుతున్న ఐద్వా 14వ జాతీయ మహాసభల ప్రాంగణంలో ఆర్ట్ గ్యాలరీని కేరళ విద్యా శాఖ మంత్రి ఆర్ బిందు రాధాకృష్ణన్ ప్రారంభించారు. సహజ వస్తువులతో రూపొందించిన చిత్రాలను ఆమె తిలకించి కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి ఆరూరి రమేష్ రాజీనామా

మున్సిపల్ ఎన్నికల వేళ మాజీ ఎమ్మెల్యే అనూహ్య నిర్ణయం

బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటన

విశ్వంభర, వరంగల్ : మున్సిపల్ ఎన్నికల వేళ తెలంగాణ బీజేపీకి షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇన్నిరోజులు పార్టీలో తనకి సహకరించిన బీజేపీ పెద్దలకి, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆహ్వానం మేరకు అనుచరులు, అభిమానులతో కలిసి సొంతగూటికి చేరుతున్నట్టు స్పష్టం చేశారు. ఆరూరి రమేష్ 2009లో ప్రజా రాజ్యం పార్టీ తరపున వరంగల్ జిల్లా, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) లో చేరారు. వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి వరుసగా రెండు సార్లు 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడవసారి 2023 లో అదే నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగి ఓటమిపాలయ్యారు. 2024లో లోక్ సభ ఎన్నికల ముందు బీజేపీలో చేరిన ఆరూరి రమేష్ వరంగల్ లోక్ సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వరంగల్ స్థానిక సంస్థల ఎన్నికలు, ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ఆయన మద్దతుదారులు భారీ ఓటమి చూశారు. దీంతో భవిష్యత్తు రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, బీఆర్ఎస్ ఆహ్వానం మేరకు తిరిగి ఆయన సొంతగూటికి చేరుతున్నట్టు ఆరూరి వర్గీయులు చెబుతున్నారు.

కులాంతర–మతాంతర వివాహితులకు పరిరక్షణ చట్టం తీసుకురావాలి

- వహీద్, కృష్ణచంద్

విశ్వంభర, ముషీరాబాదు : కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు ముందుకు రావాలని, దంపతులకు చట్టపరమైన రక్షణ కల్పించే కులాంతర-మతాంతర వివాహితుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలని కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు ఎం.డి. వహీద్, ప్రధాన కార్యదర్శి డి.ఎల్. కృష్ణచంద్ అన్నారు. ఆదివారం హైదరాబాదు ఇందిరాపార్క్‌లో జరిగిన కుల నిర్మూలన సంఘం 54వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కులాంతర, మతాంతర నూతన దంపతుల మేళాలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరాన్ని "కులాంతర -మతాంతర వివాహితుల పరిరక్షణ చట్ట సాధన సంవత్సరం"గా ప్రకటించారు. కులం పేరుతో సమాజం విభజనకు గురై అన్యాయాలు జరుగుతున్నాయని, వాటిని ఎదుర్కోవడానికి కులాంతర వివాహాలే బలమైన మార్గమని వక్తలు చెప్పారు. దంపతులకు కనీసం పది లక్షల రూపాయల ప్రోత్సాహకం ఇవ్వాలని, పరువు హత్యల నివారణకు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాలని, ఆర్థిక దన్ను కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పథకాలన్నిటిలో కులాంతర, మతాంతర వివాహితులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అతిథులుగా హాజరైన సి ఎల్ ఎం గాంధీ, జస్టిస్ రాధారాణి లను ఘనంగా సత్కరించారు కార్యక్రమం నిర్వాహకులు. కార్యక్రమం లో కుల నిర్మూలన సంఘం వహీద్ అధ్యక్షతన కృష్ణచంద్ కులాంతర, మతాంతర వివాహం చేసుకున్న నూతన దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, కార్యకర్తలు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముంబై మాఘి గణపతి ప్రతిష్ట

విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాదు అంబర్‌పేట పోచమ్మ బస్తిలో తొలిసారిగా మాఘి గణపతి ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా భక్తి, ఐక్యత, సామాజిక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి పాల్గొనే ఉత్సవంగా మాఘి గణపతి వేడుకను తీర్చిదిద్దామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని స్వామి దయానంద్ యంగ్ మెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, అంబర్‌పేట పోచమ్మ బస్తి దేవాలయ ఆవరణలో రంగంపల్లి రాజు నాయకత్వంలో నిర్వహించారు. యువతలో స్వతంత్ర ఆలోచన, సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగించడమే ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు వివరించారు. ముంబైలో మాఘి గణపతి ఉత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో, సేవా కార్యక్రమాలతో కలిపి నిర్వహించే సంప్రదాయం ఉందని తెలిపారు. ప్రసాద పంపిణీ, సామూహిక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమాజ సేవతో కూడిన పండుగగా అక్కడ ఇది జరుగుతుందని పేర్కొన్నారు. అదే తరహాలో హైదరాబాదులో కూడా ప్రజలంతా కలిసి జరుపుకునే ఉత్సవంగా మాఘి గణపతిని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. పోచమ్మ బస్తిలో తొలిసారిగా ముంబై తరహాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మాఘి గణపతి ఉత్సవాన్ని ఇంకా విస్తృతంగా, ప్రత్యేకంగా నిర్వహించి, నగరానికి ఆదర్శంగా నిలిచేలా కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్వామి దయానంద్ యంగ్ మెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పోచమ్మ బస్తి యువకులు, స్థానిక పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ కలిసి ఈ ఉత్సవాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. మాఘి గణనాయకుడి పండుగను ప్రతి ఏటా ఇదే విధంగా కొనసాగిస్తూ, భక్తి-ఐక్యత-సేవా భావనతో కూడిన ఉత్సవంగా ముందుకు తీసుకెళ్తామని వారు స్పష్టం చేశారు.



రూ.26వేలకే కారు అంటూ ప్రకటన.. వ్యాపారి అరెస్ట్

- 'రిపబ్లిక్ డే' ఆఫర్‌తో బురిడీ కొట్టించిన వ్యాపారి
- షోరూమ్‌పై జనం రాళ్ల దాడి..
- రోషన్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు

విశ్వంభర, క్రైం బ్యూరో: గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారీ డిస్కౌంట్ ఇస్తానంటూ ప్రజలను తప్పుదోవ పట్టించిన పాత కార్ల వ్యాపారి రోషన్‌పై నాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. కేవలం వ్యాపార ప్రచారం కోసం తప్పుడు వాగ్దానాలు చేసి శాంతిభద్రతల సమస్యకు కారణమైనందుకు ఈ చర్య తీసుకున్నారు. మల్లాపూర్‌కు చెందిన రోషన్ తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో "రిపబ్లిక్ డే స్పెషల్: కేవలం రూ. 26,000కే కారు" అని ప్రకటించాడు. అంతటితో ఆగకుండా అటువంటి 50 కార్లు సిద్ధంగా ఉన్నాయని పోస్ట్ చేయడంతో, ఆశావహులు సోమవారం తెల్లవారుజాము నుండే షాపు ముందు బారులు తీరారు.

జనం భారీగా రావడంతో భయపడిన రోషన్, తన వద్ద కేవలం 10 కార్లు మాత్రమే ఉన్నాయని, మిగతావి లేవని చేతులెత్తేశాడు. దీంతో వేల సంఖ్యలో తరలివచ్చిన జనం తాము మోసపోయామని గ్రహించారు. దీంతో ఆగ్రహించిన బాధితులు షాపులోని కార్లపై రాళ్లతో దాడి చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న నాచారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోషన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తప్పుడు ప్రకటనలతో ప్రజలను వంచించినందుకు అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో వచ్చే నమ్మశక్యం కాని ఆఫర్లను గుడ్డిగా నమ్మవద్దని, ఇలాంటి తప్పుడు ప్రకటనలు ఇచ్చే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

విశ్వంభర, హైదరాబాద్ : చారిత్రక కొత్వాల్ హౌజ్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. 2002 తర్వాత తొలిసారిగా సీపీ హోదాలో ఉన్న అధికారి కొత్వాల్ హౌజ్‌లో జెండా ఎగురవేయడం విశేషం. కార్యక్రమంలో చార్మినార్ జోన్ డీసీపీ ఖరే కిరణ్ ప్రభాకర్, అదనపు డీసీపీ మజీద్, టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ లో అభిమాని మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్

విశ్వంభర, హుస్నాబాద్ : హుస్నాబాద్ నియోజకవర్గంలోని పోతారం (ఎస్) గ్రామం లోని మొదటి వార్డు మెంబర్ గోల్లేని యాదమ్మ సమ్మయ్య లు గత ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే గా గెలవాలని సమ్మక్క సారలమ్మ మొక్కు కొన్నారు. గత జాతర సమయంలో మొక్కులు చెల్లించడం వీలుకాకపోవడంతో ఈరోజు హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చేత మేడారం సమ్మక్క సారలమ్మ లకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు. తన అభిమాని మొక్కులు పూర్తి చేసి వారి కుటుంబ సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.వారి కుటుంబం ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యాలతో ఉండాలని పిల్లలకు ఆశీర్వాదం అందించారు. తమ అభిమాన నేత అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న సందర్భంగా గొల్లెని యాదమ్మ సమ్మయ్య లు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

'ప్రెస్' స్టిక్కర్ నిబంధన అవమానకరం

- మామిడి సోమయ్య

విశ్వంభర, హైదరాబాద్ : అక్రెడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే వాహనాలకు 'ప్రెస్' స్టిక్కర్ పెట్టుకోవాలన్న నిబంధన జర్నలిజం వృత్తిని అవమానించేదిగా ఉందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. రాష్ట్ర సమాచార శాఖ జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రెడిటేషన్ కార్డు లేని అనేక మంది జర్నలిస్టులు మీడియా సంస్థల గుర్తింపు కార్డులతో వృత్తి నిర్వహిస్తున్నారని తెలిపారు. నకిలీ జర్నలిస్టులను కట్టడి చేయడం అవసరమేనని, అయితే ఆ పేరుతో అసలైన జర్నలిస్టులను అవమానించడం సరైంది కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ద్వారా జారీ చేసిన ఈ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.

గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడి నియామకం

విశ్వంభర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ చేనేత ఐక్య వేదిక ఉపాధ్యక్షుడిగా పెండెం నరేందర్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్య వేదిక అధ్యక్షులు రాపోలు వీరమోహన్ చేతుల మీదుగా తుర్కయంజాల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని అందరికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యకమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సామల స్వప్న , ఉపాధ్యక్షులు జెల్ల పర్వతాలు ,కార్యాలయ కార్యదర్శి సామల మనోహర్ , కర్నాటి అశోక్ , రాపోలు పుండరీకం , రాపోలు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీత్రీ న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశ్వంభర, హైదరాబాద్ : వీత్రీ న్యూస్ ఛానల్ , విశ్వంభర దినపత్రిక లకు సంబందించిన నూతన క్యాలెండర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ చేతులమీదుగా నారాయణగూడ లోని తెలంగాణ పద్మశాలి భవన్ రాజ్ మొహల్లా లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మీడియా పాత్ర చాల ప్రముఖమైనదనీ, అలాగే ప్రజలకు , ప్రభుత్వానికి వారధిగా ఉంటూ మీడియా తన భాద్యతను నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్న విత్రీ న్యూస్ ఛానల్ .విశ్వంభర దినపత్రిక లకు శుభాకాంక్షలు తెలియయజేశారు. రానున్న రోజుల్లో మరింతగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోముల రేఖ , చిన్నకోట్ల సప్నరాజ్ , మద్దూర్ శశికళ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పతాకావిష్కరణ

విశ్వంభర, హైదరాబాద్ : 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు రాపోలు వీరమోహన్ చేతులమీదుగా తుర్కయంజాల్ లోని రాష్ట్ర కార్యాలయంలో పతాకావిష్కరణ ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా రాపోలు వీరమోహన్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగం స్వేచ్ఛతో పాటు ప్రతి పౌరుడికి న్యాయం, సమానత్వం, గౌరవం కల్పించిందని గుర్తుచేస్తూ, ప్రజాస్వామిక, గణతంత్ర, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ దేశంగా భారతదేశం ప్రగతి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షించారు.రాజ్యాంగ నిర్మాతల దార్శనికతకు, గణతంత్రాన్ని తీర్చిదిద్దిన త్యాగమూర్తులకు ఈ సందర్భంగా నివాళులర్పిస్తూ, యోధుల ఆకాంక్షలకు అనుగుణంగా దేశ సేవకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జెల్ల రఘు , రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సామల స్వప్న , ఉపాధ్యక్షులు జెల్ల పర్వతాలు , గ్రేటర్ హైదరాబాద్ చేనేత ఐక్య వేదిక అధ్యక్షులు ఏలే మహేష్ నేత, ఉపాధ్యక్షులు పెండెం నరేందర్ , కార్యాలయ కార్యదర్శి సామల మనోహర్ , కర్నాటి అశోక్ , రాపోలు పుండరీకం , రాపోలు జితేందర్ పాల్గొన్నారు.

లండన్ లో చేనేత ఖ్యాతి చాటనున్న చండూరువాసి

విశ్వంభర, చండూరు : నల్లగొండ జిల్లా చండూరు పట్టణానికి చెందిన చిలుకూరి శ్రీనివాస్ భారత దేశ చేనేత కళలు, నైపుణ్యా లను లండన్ వేదికగా ప్రపంచానికి చాటనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు అక్కడ జరగనున్న 76వ వర్తక షో 'స్ప్రింగ్ ఫెయిర్'లో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన హ్యాండ్లూమ్ ఎక్స్పోర్ట్ ప్రమో షన్ కౌన్సిల్ ఏర్పాటు చేసే మేడ్ ఇన్ ఇండియా పెవిలియ న్లో చేనేతపై లైవ్ డెమోకు ఆయన ఎంపి కయ్యారు. ఈ లైవ్ డెమోలో మగ్గంపై చీరల తయారీతోపాటు డబుల్ ఇక్కత్, కోటా ఇక్కత్, జమ్లానీ వెరైటీల తయారీ విధానాలను శ్రీనివాస్ ప్రదర్శించనున్నారు. ఈ నెల 29న లేదా 30న లండ న్ కు బయలుదేరనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. 15 ఏళ్లుగా చేనేత రంగంలో తాను పడిన కష్టానికి గుర్తింపు లభించిందని చెప్పారు.

మేడారం పాసుల గోల

- ఎమ్మెల్యేకు5+5, మంత్రికి 10 +10 పాసులు
- మరీ ఇంత తక్కువా అంటూ ప్రజాప్రతినిధులు ఆగ్రహం
- మీడియా పాసులపైనా ఆంక్షలు

విశ్వంభర, వరంగల్ : మేడారం మహా జాతరకు ఒక్కరోజే మిగిలి ఉండగా వెహికల్, దర్శనం పాస్ ల పంచాయితీ షురూ అయింది. రెండేళ్లకోసారి జరిగే మహా జాతరకు వచ్చి తల్లులను దర్శించుకునేందుకు ప్రముఖులు, మీడియా ప్రతినిధుల కోసం జిల్లా అధికార యంత్రాంగం వీవీఐపీ, వీఐపీ పాస్ లు జారీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో సుమారు 30 వేల వెహికల్, దర్శనం పాస్ లు ముద్రించి మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలకు ఒక్కొక్కరికి కేటగిరి వారీగా వంద నుంచి 300 వరకు పాస్ లు ఇచ్చేవారు. ఒక్కో పాస్ పై ఐదుగురు దర్శనం చేసుకునేవారు. సామాన్య భక్తులు కంటే వీఐపీల తాకిడి ఎక్కువై క్యూ లైన్లను కంట్రోల్ చేయడం పోలీస్ యంత్రాంగానికి సవాల్ గా మారింది. దీంతో రాను రాను పాస్ లను తగ్గిస్తూ వస్తున్నారు. ఈ సారి జాతరలో సౌకర్యాలు మెరుగు పరచడంతో పాస్ ల సంఖ్య ను 10 వేలకు తగ్గించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం అధికార పార్టీ నేతలకు తలనొప్పిగా మారింది.

ఎమ్మెల్యే కు 5, మంత్రికి 10కి పైన..

మంత్రులకు 10 నుంచి 20, ఎమ్మెల్యేకు 5 వెహికల్, 5 దర్శనం పాస్ లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మీడియా పాస్ ల విషయంలో కూడా నిబంధనలు పెట్టడంతో మేడారం జాతర కవరేజ్ కోసం వెళ్లే జర్నలిస్టులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధుల విషయానికొస్తే కొందరు గొడవ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి సోమవారం సాయంత్రం పాస్ ల కోసం ములుగు కలెక్టరేట్ కు వెళ్లగా 30 పాస్ లు ఇవ్వడంతో ఆమె సీరియస్ అయి తీసుకోకుండానే వెనుదిరిగినట్లు సమాచారం. అదే విధంగా కొంతమంది కాంగ్రెస్ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు సైతం పాస్ ల విషయంలో గుర్రుగా ఉన్నట్లు సమాచారం. కేవలం 30, 40 పాస్ లు ఇస్తే నియోజకవర్గంలో ఉన్న ప్రజాప్రతినిధులకు ఏం సమాధానం చెప్పాలని ప్రభుత్వ పెద్దలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారంట.